ఇరుకు రోడ్లతో అవస్థలు

- దశాబ్దం క్రితం రోడ్డు విస్తరణకు మార్కింగ్
- ఇప్పటికీ ప్రారంభం కాని బోరబండ, రహ్మత్‌నగర్ రోడ్డు నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు

బోరబండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బోరబండ, రహ్మత్‌నగర్ ప్రాంతాల్లో ఇరుకు రోడ్లకు మోక్షం లభించడం లేదు. దశాబ్ద కాలంగా ప్రధాన రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తర్వాతైనా రహదారులు విస్తరణకు నోచుకుంటాయోమేనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



రహ్మత్‌నగర్ కూడలిలో ఇరుకుగా ఉన్న రహదారి

బోరబండలో..

బోరబండ బస్టాపు నుంచి సైట్-3 కాలనీ హైటెక్ హోటల్ వరకు ప్రధాన రహదారిని 60 అడుగులకు విస్తరించాలని దశాబ్దం క్రితం అధికారులు నిర్ణయించారు. అందుకోసం ఆస్తులు కోల్పోతున్న వారికి చెక్కులను కూడా పంపిణీ చేశారు. అయితే కొన్ని వివాదాల కారణంగా కొంతమందికి చెక్కులు అందలేదు. రహదారికి ఇరువైపులా అక్కడక్కడ మాత్రమే విస్తరణ పనులు జరగడం, కొన్నేళ్లుగా విస్తరణ పనులు నిలిచిపోవడం ప్రజలకు మరింత సమస్యగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ కాలనీ, కొండాపూర్, మియాపూర్, గచ్చిబౌలి, పటాన్‌చెరువు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా మంది ప్రయాణికులు బోరబండ రహదారిని ఆశ్రయిస్తారు. మోతీనగర్ కూడలి నుంచి బోరబండ బస్టాపు వరకు కొన్ని చోట్ల 100 అడుగుల వెడల్పున్న ప్రధాన రహదారి కుచించుకుపోయింది. అదే విధంగా ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద జాతీయ రహదారిని ఏజీ కాలనీ, శ్రీరామ్‌నగర్, బోరబండ మీదుగా హైటెక్‌సిటీ 100 ఫీట్ల రోడ్డుకు అనుసంధానం చేసే విధంగా రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు.

రహ్మత్‌నగర్ కూడలిలో..

రహ్మత్‌నగర్ కూడలిలో ప్రధాన రహదారి విస్తరణ పనులు జరగక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ నుంచి రహ్మత్‌నగర్ కూడలి మీదుగా మధురానగర్ పోలీస్‌స్టేషన్ వరకు ప్రధాన రహదారిని 80 అడుగులకు విస్తరించాలని దశాబ్దాల క్రితమే అధికారులు నిర్ణయించారు. విస్తరణలో భాగంగా 11 ఆస్తులు ప్రభావితమవుతాయని అధికారులు గుర్తించారు. వీటిలో మూడు ప్రభుత్వ ఆస్తులు కాగా, మిగతా 8 ఆస్తులకు సంబంధించి పరిహారం చెల్లించాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీప్లానర్, రెండేళ్ల క్రితం సంస్థ కమిషనర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రహ్మత్‌నగర్ కూడలిని సందర్శించి రహదారి విస్తరణ పనులు త్వరలోనే చేపడతామని హామీనిచ్చారు. అధికారులు, నేతలు సందర్శించడం షరా మామూలు విషయంగా మారింది. ఈ దారిలో ఒక బస్సు వస్తే ఇతర వాహనాలు వెళ్లడం కష్టంగా మారింది. ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారుల మీదుగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకొని ప్రయాణించే బాధలు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాతనైనా తొలగాలని ప్రజలు ఆశిస్తున్నారు.



బోరబండలో ఇరుకు రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వాహనాలు



విస్తరణ కోసం బోరబండ ప్రధాన రహదారిపై వేసిన మార్కింగ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం: ఎమ్మెల్యేలు

బోరబండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, జగదీశ్వర్‌రెడ్డిలు అన్నారు. సోమవారం రాత్రి గాయత్రి హిల్స్ కాలనీలో బోరబండ డివిజన్ ఇన్‌చార్జి, బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్ గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు పక్కా అని, మెజార్టీయే తేలాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న గాయని గాయత్రీవేదాంతం

పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ఏర్పాటైన డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను టాలీవుడ్ సినీ గాయని గాయత్రీవేదాంతం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'విభిన్నమైన పటోలా ఆర్ట్స్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్రోత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. నేరుగా వీవర్ నుంచి వినియోగదారునికి అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని కోరారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ నిర్వాహకుడు భవిన్ మాట్లాడుతూ, ఈ నెల 18 వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో ప్రత్యేక కలెక్షన్స్ వేదికగా పటాన్ పటోలా, బంధనీ, బనారసీ, కాశ్మీరి, మహేశ్వరీ, కంచిపురం, గద్వాల్, లక్నోవీ, అజ్రక్ చీరలు, సూట్లు, కుర్తీలు, డ్రస్ మెటీరియల్, బెడ్‌షీట్లు, ఆభరణాలు అందుబాటులో ఉంచామని వివరించారు. నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన సామాజిక లక్ష్యమని ఆయన తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న దళితసేన, ఎస్సీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు

'సీజేఐపై దాడి అమానుషం'

ఎర్రగడ్డ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని ఆలిండియా దళిత సేన, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు అన్నారు. సీజేఐపై దాడికి నిరసనగా సోమవారం ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు ఎల్బీస్టేడియం నుంచి ట్యాంకుబండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆలిండియా దళిత సేన చైర్మన్ రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మాజీ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్, గద్దర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి టీటీడీ ఆలయంలో పవిత్రోత్సవం

బంజారాహిల్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 19 వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అందుకు ఈ నెల 16న సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. 17న పవిత్ర ప్రతిష్ఠ, 18న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపట్టనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 19న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరుగనుంది. పవిత్రోత్సవాల సందర్భంగా రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

'బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం'

గచ్చిబౌలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని, బీసీలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి బీసీ నాయకులు అన్నారు. సోమవారం కొండాపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బేరి రామచంద్రయాదవ్ మాట్లాడుతూ, ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని, కార్యక్రమంలో అన్ని బీసీ కులాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏళ్ల తరబడి బీసీలకు అన్యాయం జరుగుతుందని, ఇప్పటికైనా బీసీలందరూ ఒకేతాటిపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామస్వామియాదవ్, డాక్టర్ అరుణ్‌కుమార్, ఒంగోరు శ్రీనివాస్‌యాదవ్, రమేష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

'సన్ డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సన్ డిగ్రీ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వెంకటేశంకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి కోచిం గ్ సెంటర్లు కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన డిగ్రీ కోర్సులను నిర్వహించరాదని నిబంధన ఉన్నా, దానికి విరుద్ధంగా రామ్‌నగర్‌లోని సన్ డిగ్రీ కళాశాలలో లింగయ్య విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఎంబీఏ కోర్సులు అలాగే డిప్లమా కోర్సులను నడుపుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేసి, కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు.

మాగంటి కుటుంబాన్ని ఆదరించాలి

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బోరబండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మాగంటి కుటుంబాన్ని ఆదరించి గెలిపించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ క్రీడా ప్రాంగణంలో సోమవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడచిన 11 ఏళ్లలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గడిచిన రెండు సంవత్సరాల్లో చేసిందేమీ లేదని విమర్శించారు. ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్మించిన తాగునీటి రిజర్వాయర్‌కు మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని ఆయన కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, తనకెప్పుడూ మాగంటితో విభేదాలు లేవని తెలిపారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరనివ్వనని స్పష్టం చేశారు. మాగంటి సునీత కుతూరు అక్షర మాట్లాడుతూ, నాన్న ఆశయ సాధనకు తమ కుటుంబం పని చేస్తుందన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

ఎన్నికల్లో యువత పాత్ర కీలకం: నవీన్

బంజారాహిల్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో యువత పాత్ర కీలకమని, సరైన నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు ఉపఎన్నికల్లో యువత కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నారు. యూసుఫ్‌గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉపఎన్నిక సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నవీన్‌యాదవ్ మాట్లాడుతూ, యువత ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించాలని సూచించారు. సోషల్‌మీడియాలో ప్రచారాన్ని ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి, ఖైరతాబాద్, సికింద్రాబాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హరిధర్, మధు, రాహుల్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవీన్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేత ఫయాజ్

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకుడు

బోరబండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గంగానగర్ అధ్యక్షుడు ఎండీ. ఫయాజ్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ఆయనకు పార్టీ కండువా ఆహ్వానించారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఆయన పార్టీ మారడం డివిజన్‌లో చర్చనీయాంశంగా మారింది. గంగానగర్ బస్తీ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఫయాజ్ తెలిపారు.

మహిళలు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలి

- మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. నాగార్జుననగర్ కాలనీలోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా మోర్చా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీకి మహిళా కార్యకర్తల బలం అధికంగా ఉందన్నారు. వారి ఆదరణతో పార్టీ అనేక విజయాలు సొంతం చేసుకుందని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అదే జరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని మాజీ ఎమ్మెల్యే మహిళా మోర్చా నాయకులకు సూచించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో బీజేపీకి బలం పెరిగిందని, ఈ ఎన్నికలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. సమావేశంలో కీర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

జూబ్లీహిల్స్‌లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతాం

- పలువురు వక్తలు

రాంనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజా సంఘాలు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతామని పలువురు వక్తలు తెలిపారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు వెంకటస్వామి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డిలు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయని నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తెలంగాణ ఉద్యమకారుల నుంచి ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టి కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామన్నారు. ఉద్యమకారులకు గతంలో బీఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్ పార్టీలు అన్యాయం చేశాయని వారు ఆరోపించారు. ఈ పార్టీలను ఓడించడమే లక్ష్యంగా తాము ఉమ్మడి అభ్యర్థిని నిలబెడతామన్నారు. తాము బరిలో నిలిపే అభ్యర్థికి జూబ్లీహిల్స్ ప్రజలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రన్న, మోహన్ బైరాగి, అంసోల్ లక్ష్మణ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, ప్రజ్యోత్‌కుమార్, సుజీ, లావణ్య, సుచరిత, బోయపల్లి రంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ప్రజా సంఘాలు, పలు పార్టీల నేతలు

యశ్వంత్ మహావిద్యాలయంలో ప్రొఫెసర్ మాధవి కీలక ప్రసంగం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్ యశ్వంత్ మహావిద్యాలయం భారత ప్రధాన్ మంత్రి ఉన్నత విద్యా అభియాన్ (పీఎం-ఉషా) ఆధ్వర్యంలో "జీవశాస్త్రం పరిశోధన ధోరణులు: ఆవిష్కరణలలో ఉద్భవిస్తున్న సరిహద్దులు" అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును ఈ నెల11న నిర్వహించింది. ఈ సదస్సుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం, జువాలజీ విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ మాధవిని ప్రధాన ఉపన్యాసకురాలిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె "జీవశాస్త్రం 2050 వికసిత భారత్ ఆరోగ్యం, ఆహారం, స్థిరత్వం భవిష్యత్‌ను రూపొందించడం" అనే అంశంపై ఆలోచనాత్మకంగా, ప్రేరణాత్మకంగా ఉపన్యాసం ఇచ్చారు. ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ స్థిరత్వం రంగాలలో జీవ విజ్ఞాన శాస్త్రాల భవిష్యత్ దిశను వివరిస్తూ, వికసిత భారత్ లక్ష్య సాధనలో శాస్త్రవేత్తల పాత్రను ప్రొఫెసర్ మాధవి వివరించారు. అనంతరం ఆమె ఉపన్యాసం నిర్వాహకులు, ప్రతినిధులు, ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ఆధ్వర్యంలో తండ్రిలేక సంరక్షణ కోల్పోయిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం ఆర్థిక సహకారానికై దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో అంజనరెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఆర్థిక సహాయం పొందడానికి అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు నవంబర్ 14 వరకు కాచిగూడలోని మున్నూరుకాపు ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తండ్రిలేక సంరక్షకుని మరణ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, గత సంవత్సరం మార్కుల పట్టిక, బ్యాంకుపాస్ బుక్ జిరాక్స్ కాపీలను జతచేయాలని కోరారు. పూర్తి వివరాలకు 9491627404 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రేమ పేరుతో యువకుడి మోసం

అమీర్‌పేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని యువతి వెంట పడి, ఆమెతో చనువుగా తిరిగి, తీరా పెళ్లి అనే సరికి ముఖం చాటేసిన యువకుడిపై ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లికి చెందిన అభిరాంరెడ్డి (30) అమీర్‌పేటలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేస్తున్న యువతి(23)తో అభిరాంరెడ్డి పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. యువతి అతని మాటలు నమ్మింది. ఇద్దరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇటీవల యువతి పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చేసరికి అభిరాంరెడ్డి దాటవేస్తూ వచ్చాడు. ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ హోటల్‌లో కనిపించిన అభిరాంతో బాధితురాలు మరోసారి పెళ్లి ప్రస్తావన తెచ్చింది. దీంతో ఆమెపై దాడి చేశాడు. వెంటనే బాధితురాలు ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

రాయదుర్గం, (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసి 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన కటాయి రాములు(23) జీహెచ్‌ఎంసీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన అతడు శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ద్విచక్రవాహనాలను దొంగిలించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెయిఫిల్ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా రాములు పట్టుబడ్డాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



తుకారాంగేట్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆదం సంతోష్ కుమార్

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఆదం

అడ్డగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ సూచించారు. సోమవారం తుకారాంగేట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ప్రత్యేక సమావేశానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుస్తాడని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంట రాజు సాగర్, హరి, ప్రభాకర్‌లతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



గాంధీ మెడికల్ కాలేజీ మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొన్న వైద్యులు

గాంధీ మెడికల్ కాలేజీ మైదానంలో క్రికెట్ పోటీలు

అడ్డగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ మైదానంలో సోమవారం గాంధీ మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీ వర్సస్ పీజీ వైద్యుల మధ్య క్రికెట్ పోటీలు జరిగాయి. ఫ్యాకల్టీ 20 ఓవర్లలో 151 పరుగులు చేసింది. పీజీ వైద్యులు 18వ ఓవర్ల టార్గెట్ విజయవంతంగా సాగింది. 7వ ఓవర్ వరకు 44/2 వద్ద మంచి ఒత్తిడిని తలపించింది. అనంతరం పీజీ వైద్యులు మ్యాచ్‌ను తమ నియంత్రణలోకి తీసుకొచ్చారు. బ్యాటింగ్‌లో మురళీ కృష్ణ, వంశీ, సందీప్, కిరణ్‌లు బాగా రాణించారు. బౌలింగ్‌లో కిరణ్, లక్ష్మి కాంత్, మురళీ కృష్ణలు అద్భుతంగా బౌటింగ్ చేసి చెరొక వికెట్ తీసుకున్నారు విజేతలను డాక్టర్ కిరణ్ మాదాలతో పాటు తోటి వైద్యులు క్రీడాకారులను అభినందించారు.



జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ అంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న నక్కల శోభ

ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి : నక్కల శోభ

అడ్డగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సర్వే చేసినవారికి వెంటనే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని రుద్రవీణ మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ సోమవారం సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ అంజనేయులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆన్‌లైన్‌లో, ప్రజా పాలనలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్న వారికి జీహెచ్‌ఎంసీ అధికారులు ఫోన్ చేసి సర్వే చేస్తున్నామని చెప్పి వివరాలు సేకరించారన్నారు. కేవలం అడ్డగుట్ట డివిజన్‌లో వందల మంది ఉన్నప్పటికీ శాస్త్రినగర్ బస్తీలో దాదాపు రెండువందల మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో వందమందికి అధికారులు ఫోన్ చేసి సర్వే చేశారన్నారు. అధికారులు సర్వే చేసిన వారికి వెంటనే ఇళ్లు పంపిణీ చేయాలని ఉప కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. ఇదే విషయంపై మూడు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు కూడా వినతి పత్రం సమర్పించామన్నారు. ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం సభ్యులు సురేఖ, విజయలక్ష్మి, రేచల్, స్రవంతి, రేవతి, లక్ష్మి, గీతలు ఉన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న దళితసేన, ఎస్సీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు

'సీజేఐపై దాడి అమానుషం'

ఎర్రగడ్డ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని ఆలిండియా దళిత సేన, తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు అన్నారు. సీజేఐపై దాడికి నిరసనగా సోమవారం ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు ఎల్బీస్టేడియం నుంచి ట్యాంకుబండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆలిండియా దళిత సేన చైర్మన్ రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మాజీ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్, గద్దర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు?

20 ఏళ్లుగా మాటలకే పరిమితం

వారాసిగూడ చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం

వాహనదారుల ఇబ్బందులు

బౌద్ధనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ - జామై ఉస్మానియా ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ కనుమరుగైంది. ఇరవై సంవత్సరాలుగా విస్తరణకు నోచుకోకపోవటంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా... ఈ ప్రాంతంలో విస్తరణ ఉనికేలేదు. గతంలో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో చిలకలగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ కోసం వందకోట్ల రూపాయలు నిధులు మంజూరైనా అవి మరుగునపడ్డాయి. అధికారులు అప్పుడప్పుడు విస్తరణ పేరిట హడావిడి చేసి వెళుతున్నా అది శూన్యం. రోడ్డు విస్తరణ పనులు కలగానే మిగిలి పోవటంతో వాహనదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు విస్తరణ పేరిట మూడు సార్లు మార్కింగ్ వేసి చేతులు దులుపుకున్నారు. రోడ్డు విస్తరణ జరిగి ఆయా ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంటే ఈ ప్రాంతం నగరంలో వెనుకబడి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వివిధ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేసి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన సందర్భాలున్నాయి. జనాభా పెరగటంతో పాటు వాహనాలు సంఖ్య పెరగటంతో ఈ రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ వస్తుంది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో బస్సుల సంఖ్యను తగ్గించారు. అలాగే చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్ పాయింట్ వద్ద మూల మలుపులు ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యాపారులు ఉన్న ఇరుకు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహించటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వారాసిగూడ చౌరస్తా మూలమలుపులో ఆర్టీసీ బస్సుల అవస్థలు

రోడ్డు ఇరుకును బట్టి విస్తరణ

చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు మొదట 60 అడుగుల మేర విస్తరించాలని గతంలో అధికారులు మార్కింగ్ వేసినప్పటికీ, మాస్టర్ ప్లాన్‌లో టర్నింగ్ పాయింట్ చౌరస్తాలను 80 అడుగులు, మామూలు చోట 60 అడుగుల విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం రోడ్డు ఇరుకుబట్టి, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. విస్తరణలో నష్టపోయిన వారికి ప్రభుత్వం తరఫున టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్) స్కీమ్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్ వద్దనుకున్న వారికి చెక్కుల రూపంలో నష్టపరిహారం చెల్లించటానికి నిర్ణయించారు. చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణలో సుమారు 350 ఇళ్లు, వ్యాపార భవనాలు కనుమరుగు కానున్నాయి. రోడ్డు విస్తరణ చేయవద్దని కొంతమంది వ్యాపారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం.



విస్తరణ చేపట్టాలి

చిలకలగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. మూలమలుపులో ఆటోలు పెట్టడం వలన పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వారాసిగూడ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- పాతూరి మల్లేష్, శ్రీనివాస్‌నగర్‌కాలనీ



కనీసం మూలమలుపుల వద్ద అయినా విస్తరించండి

చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ మూలమలుపుల వద్ద కనీసం రోడ్డు విస్తరణ చేస్తే కొద్దిగా వాహనాదారులకు ఉపశమనం కలుతుగుంది. మూలమలుపుల రోడ్లలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకుగా ఉన్నా రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వారాసిగూడ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వస్తున్నాయంటే డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. విస్తరణ పనుల ప్రతిపాదనలను ముందుకు తీసుకురావాలి.

- నగేష్ గౌడ్, వారాసిగూడ

ఉప ఎన్నిక ఎఫెక్ట్.. ప్రజావాణి రద్దు

- **కార్పొరేటర్ ఆందోళనతో తిరిగి ప్రారంభం**

మల్కాజిగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల దృష్ట్యా ప్రజావాణి రద్దు చేసినట్లు మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ తెలిపారు. మల్కాజిగిరిలో ఎన్నికల కోడ్ లేనప్పుడు ప్రజావాణిని ఎలా రద్దుచేస్తారంటూ కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ ప్రశ్నించడంతో ఉప కమిషనర్ సుల్తానా తిరిగి అధికారులందరికీ ఫోన్లు ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ ఉప కమిషనర్‌గా సుల్తానా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మల్కాజిగిరిలో ఎలాంటి పనులు జరుగడం లేదని అన్నారు.

శానిటేషన్ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైన పట్టించుకోవడం లేదంటూ అధికారులను నిలదీశారు. ఎలికే హాస్పటల్ వద్ద నుంచి వాణీనగర్ చౌరస్తా వరకు రోడ్డుకు రెండు వైపులా వ్యాపారులు రోడ్లను సైతం ఆక్రమించి తమతమ షాపుల వరకు కాకుండా రోడ్డుమీది వరకు వస్తువులు పెట్టడం, వాహనాల పార్కింగ్‌తో కనీసం మనుషులు నడవలేని స్థితిలో ఉందని దీనిపై పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను నివారించాలని మా గంటి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. తక్షణమే సమస్యలపై స్పందించి ఆయా విభాగాల సిబ్బందితో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ప్రజావాణికి హాజరై సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

'42 శాతం' కోసం జేఏసీ ఏర్పాటుకు కార్యాచరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అనేక ఉద్యమాలకు వేదికగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే ఉద్యమానికి వేదిక కానుంది. సోమవారం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ అధ్యక్షత వహించిన సమావేశంలో పలు విద్యార్థి సంఘాలు బీసీ ఉద్యమానికి మద్దతు తెలిపాయి. బీసీల సమస్యే ఈ దేశ సమస్య అని, మరో సామాజిక ఉద్యమానికి ఓయూ వేదికి కావలసిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు ఏకాభిప్రాయం తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ తరహాలో విద్యార్థి జేఏసీ ఏర్పాటు చేసి పల్లె పల్లెన ఉద్యమ ఆవశ్యకతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 15న ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్‌లో జరగబోయే "ఐక్య కార్యాచరణ" సమావేశానికి అన్ని విద్యార్థి సంఘాలు, ప్రొఫెసర్లు, మేధావులు, కళాకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు అంసా అధ్యక్షులు నామ సైదులు, పొలిటికల్ జేఏసీ నాయకుడు వలిగొండ నర్సింహ, నాయి బ్రాహ్మణ విద్యార్థి సంఘం అధ్యక్షులు రవి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల అత్యవసర సమావేశంలో..

బీసీ రిజర్వేషన్‌ల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా అన్ని యూనివర్సిటీల బీసీ విద్యార్థి సంఘాల నాయకులతో కలుపుకొని ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు బీసీ సంఘాల నాయకులు ఉస్మానియా యూనివర్సిటీలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని నిర్మిస్తామని దీని కోసం త్వరలో అన్ని బీసీ విద్యార్థి, యువజన కుల, సంఘాలతో కలుపుకొని బీసీ జేఏసీ ఏర్పాటవుతుందన్నారు.



వినతిప్రతం అందజేస్తున్న లింగంగౌడ్

'సన్ డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సన్ డిగ్రీ కళాశాలను గుర్తింపు రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వెంకటేశంకు సోమవారం వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల్లో ఎలాంటి కోచింగ్ సెంటర్లు కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన డిగ్రీ కోర్సులను నిర్వహించరాదని నిబంధన ఉన్నా, దానికి విరుద్ధంగా రామ్‌నగర్‌లోని సన్ డిగ్రీ కళాశాలలో లింగయ్య విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఎంబీఏ కోర్సులు అలాగే డిప్లమా కోర్సులను నడుపుతున్నారని పేర్కొన్నారు. వెంటనే కళాశాల గుర్తింపు రద్దు చేసి, కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు.

యశ్వంత్ మహావిద్యాలయంలో ప్రొ.మాధవి కీలక ప్రసంగం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాందేడ్‌లో యశ్వంత్ మహావిద్యాలయం భారత ప్రధాన్ మంత్రి ఉన్నత విద్యా అభియాన్ (పీఎం-ఉషా) ఆధ్వర్యంలో "జీవశాస్త్రం పరిశోధన ధోరణులు: ఆవిష్కరణలలో ఉద్భవిస్తున్న సరిహద్దులు" అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సును అక్టోబరు 11న నిర్వహించింది. ఈ సదస్సుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం, జువాలజీ విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ ఎం. మాధవిని ప్రధాన ఉపన్యాసకురాలిగా ఆహ్వానించారు. ఆమె "జీవశాస్త్రం 2050 వికసిత భారత్ ఆరోగ్యం, ఆహారం, స్థిరత్వం భవిష్యత్‌ను రూపొందించడం" అనే అంశంపై ఆలోచనాత్మకంగా, ప్రేరణాత్మకంగా ఉపన్యాసం ఇచ్చారు. ఆరోగ్యం, ఆహార భద్రత, పర్యావరణ స్థిరత్వం రంగాలలో జీవ విజ్ఞాన శాస్త్రాల భవిష్యత్ దిశను వివరిస్తూ, వికసిత భారత్ లక్ష్య సాధనలో శాస్త్రవేత్తల పాత్రను వివరించారు. ఆమె ఉపన్యాసం నిర్వాహకులు, ప్రతినిధులు, ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

క్రైం సమాచారం

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



ప్రకాశ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ జీఆర్‌పీ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి యాచారం మండలం దర్మన్నగూడెం గ్రామానికి చెందిన హనుమండ్ల ప్రకాశ్ (19) కొన్ని నెలలుగా మతిస్థిమితం సరిగా లేక బాధపడుతున్నాడు. అతడిని 11న తండ్రి రాములు సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లోని మానసిక చికిత్స కేంద్రంలో చేర్పేందుకు బన్సీలాల్‌పేట్‌కు తీసుకొచ్చాడు. కేంద్రంలో అధికారులు లేకపోవడంతో అక్కడి వాళ్లు సాయంత్రం రావాలని చెబితే ఎక్కడికి వెళ్ళాలో తెలియక తండ్రి, కొడుకు ఇద్దరు కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నంబరు 10లో సేద తీర్చుకునేందుకు వచ్చి భోజనం చేస్తున్నారు. కొడుకు ప్రకాశ్ తాగడానికి నీళ్లు కావాలని అడుగడంతో తండ్రి కొడుకును అక్కడే కూర్చోబెట్టి నీళ్ల కోసం స్టాల్‌కు వెళ్లి వచ్చేలోపు కొడుకు కనిపించలేదు ఆ రోజు రైల్వేస్టేషన్‌లో వాకబు చేశారు. అనంతరం ఇంటికి వెళ్లాడని అనుకుని గ్రామంలో వాకబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో తండ్రి ఆదివారం సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

అడ్డగుట్టలో వృద్ధుడు..



వెంకటేశ్

అడ్డగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పనికోసమని బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అడ్డగుట్ట కమ్యూనిటీ హాలు సమీపంలో ఉంటున్న వెంకటేష్(52) లేబర్ పనిచేస్తున్నాడు. ఆదివారం పని కోసమని బయటికి వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య వెంటనే బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో భార్య రుక్మిణి ఆదివారం రాత్రి తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుమలగిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కొద్దీ రోజుల క్రితం బొల్లారంలో అపస్మారకస్థితి లో గుర్తుతెలియని వ్యక్తి పడి ఉన్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి గాంధీ మార్చురీలో భద్రపరిచారు.

హెచ్‌బీ కాలనీలో మహిళ అదృశ్యం



ఏఎస్‌రావునగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ మంగాపురంలో చోటు చేసుకుంది. మంగాపురానికు చెందిన పల్లిపాటి నవీన్, కమల దంపతులు 2017లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పేయింటర్ పనిచేసే నవీన్ రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పనిమీద బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి 8 గంటలకు ఇంటికి రాగా భార్య కమల కనిపించలేదు. ఇద్దరు చిన్న పిల్లలు మాత్రమే ఉన్నారు. ఆందోళనకు గురైన నవీన్ బంధు, మిత్రుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇవేం మరమ్మతులు

- భవన నిర్మాణ వ్యర్థాలతో రోడ్లకు మరమ్మతులు
- కంటోన్మెంట్ ప్రాంతాల రహదారుల నిర్మాణానికి దక్కని మోక్షం
- ఏడాది నుంచి కొనసాగుతున్న తంతు

బోయినపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత రోడ్ల పరిస్థితి పూర్తి స్థాయి అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం, అలాగే అధ్వానస్థితికి చేరుకున్న వాటికి మరమ్మతులు చేయకపోవడంతో ఈ ప్రాంత రోడ్ల నుంచి రాకపోకలు సాగించే జనానికి శాపంగా మారుతోంది. ప్రస్తుతం ప్రధాన రోడ్డు మార్గాలు డైమండ్ పాయింట్, సెంటర్ పాయింట్, తిరుమలగిరి రోడ్, బోయినపల్లి మార్కెట్ యార్డ్ రోడ్, బోయినపల్లి బస్సు స్టాప్, తాడ్‌బండ్, బాలంరాయి రోడ్, బాపూజీ నగర్ చౌరాస్తాతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలు నడపడం అంటే వాహనదారులకు కత్తి మీద సాములా మారుతోందంటున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ప్రతి ఏటా ఈ రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు హామీలు ఇస్తున్నప్పటికీ అవి ఆచరణలోకి రావడంలేదు. అలాగే అంతర్గత రోడ్లు సక్రమంగా లేవన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తున్నామని ఇస్తున్న హామీలు నీటిమూటలవుతున్నాయంటున్నారు. ఈ పనులకు శంకుస్థాపన కూడా పూర్తయినప్పటికీ నిధులు విడుదల కాని కారణంగా ప్రారంభం కాలేదు.

అయితే ఈ రోడ్డు పరిధి ఆర్‌అండ్‌బీతో, జీహెచ్‌ఎంసీతో పాటు కంటోన్మెంట్ పరిధిలోకి వస్తున్న కారణంగా సాంకేతిక, పరిపాలన పరమైన అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఈ రోడ్ల మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు నిధులు విడుదల చేసినా నాయకులు, కాంట్రాక్టర్ల చేతివాటంతో మరమ్మతులను తూతూమంత్రంగా చేపడుతూ జేబులు నింపుకోవడానికి భవన నిర్మాణ వ్యర్థాలతో గుంతలు పూడుస్తూ చేతులు దులుపుకుంటున్నారు. రెండు రోజుల క్రితం డైమండ్ పాయింట్ చౌరాస్తాలో రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ స్థానికులు సోషల్ మీడియాల్లో పోస్టింగ్‌లు పెడుతుంటే ఈ రోడ్డుపై ఉన్న గుంతల్లో భవన నిర్మాణ వ్యర్థాలను వేయిస్తున్నారు. అలాగే ట్రాఫిక్ సాఫీగా సాగడానికి ట్రాఫిక్ పోలీసులు కూడా మట్టి, భవన నిర్మాణాల వ్యర్థాలను ఆ గుంతల్లో వేస్తున్నారు. దీంతో అటు వాహనాలు పడిపోవటమే కాకుండా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



డైమండ్ పాయింట్ వద్ద ప్రధాన రహదారిపై వేసిన భవన నిర్మాణాల వ్యర్థాలు


అన్ని రోడ్లదీ అదే దుస్థితి



కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎక్కడకు వెళ్లినా గుంతలతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలి. రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణ పనులను చేపట్టకపోతే పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ముందు ఆందోళన చేపడతాం.

- మారుతీ గౌడ్, 1వ వార్డు కాంగ్రెస్ ప్రెసిడెంట్

సత్వరమే పూర్తి చేయాలి



కంటోన్మెంట్ ప్రాంతంలోని గుంతల రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే భవన నిర్మాణాల వ్యర్థాలతో కాకుండా సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

- మురళి, బోయినపల్లి



చిన్నారులకు స్కూలు బ్యాగులు పంపిణీ చేసిన వరల్డ్ విజన్ సంస్థ ప్రతినిధులు

చిన్నారులకు స్కూలు బ్యాగుల పంపిణీ

అడ్డగుట్ట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు వరల్డ్ విజన్ సంస్థ దాదాపు 100 మందికి స్కూలు బ్యాగులు పంపిణీ చేసిందని సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ పివి కృష్ణ తెలిపారు. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాలులో ఏర్పాటు చేసిన బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాల్లో 400 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు అందజేశామని తెలిపారు. అడ్డగుట్టలో వందమందికి బ్యాగులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అరుణ జ్యోతి, సూపర్‌వైజర్ బాలమణి, బిఆర్ఎస్ నాయకులు నక్కామధు, లింగాని శ్రీనివాస్, భాగ్య, వై. సత్తయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీకి వెళ్లే దారిలో కార్ వాషింగ్ సెంటర్ వద్ద మూడు రోజులుగా తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతుందని ఫిర్యాదు చేస్తే ఎవరు పట్టించుకోవడలేదని స్థానికులు తెలిపారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి